


“రుత్ బదలే
దునియా బదలే
ప్యార్ నహీ బదల్‌తా”

**టేప్ రికార్డరులో పాట మృదుమధురంగా వినిపిస్తోంది. ప్రేమ శాశ్వతమని ఎంత అందమైన అపోహ! అపోహేనా అది? ఆ పాట విన్నప్పుడల్లా విజయ ఆలోచనలు గతంలోకి...**

* * *

మెడికల్ కాలేజీలో చదివే ఆ రోజులే వేరు. ఆ భావుకతా, భవిష్యత్తును గురించిన ఆ కమ్మని కలలూ, ఆ ఆత్మ స్థైర్యం-అవి ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది. సుజాతకీ, విజయకీ ఎప్పుడూ వాదనలు జరుగుతూ వుండేవి.

“ప్రేమ అద్భుతమైన అనుభవం. హృదయాంతరాళాల నుండి ప్రేమ జనించినప్పుడు, ఒక వ్యక్తికి ఆత్మార్పణ చేసుకునేంత ఉజ్వలమయిన ప్రేమ కలిగినప్పుడు, అది శాశ్వతం కాక మరేమవుతుంది? తను ఆరాధించే వ్యక్తి నుండి తిరిగి మనసును స్పందించే ప్రేమానుభూతిని పొందగలిగితే అంతకంటే అదృష్టం ఏముంటుంది?” అనేది విజయ.

సుజాత నవ్వి “కవిత్వం చెప్పకు విజయా! ఈ జీవితాల్లో ఏదీ శాశ్వతం కాదు. ఇవ్వాళ వుండి, రేపు మారిపోయే రంగుల కలలాంటి ప్రేమలు శాశ్వతమంటే నేను నమ్మను. మన కళ్ళెదుట ఎన్ని చూడటం లేదు? ఇవాళ విడిచి బ్రతకలేమనే జంట రేపు విడిపోయి బద్ధ శత్రువుల్లా పోట్లాడుకోవడం; పెళ్ళయి పదేళ్ళయి ముగ్గురు పిల్లలు పుట్టాక మరో అమ్మాయితో ప్రేమ కలాపాలు చేసే మగవాళ్ళను ఎంత మందిని చూడటం లేదు! ఈ భావకవిత్వం కట్టిపెట్టి అసలు ప్రపంచంలోకి రా!” అనేది.

“కాదు సుజాతా. నువ్వు చెప్పే సంఘటనలన్నీ వేరు. అసలు నిజమైన ప్రేమ వుంటే అలా జరగదు” అనేది విజయ.

“నిజమైన ప్రేమ వుంటే...” అనే చోట ఇద్దరికీ తెలియని ఏదో అస్పష్టతతో ఆగిపోయేవి వాదోపవాదాలు.

“మమ్మీ, మమ్మీ! ఆకలేస్తోంది...” అంటూ నాలుగేళ్ళ రవి తల్లి పమిట చెంగు లాగుతోంటే విజయ చటుక్కున గతంలోంచి బయటపడి, “అన్నం పెడతా నమ్మా!” అంటూ రవి నెత్తుకుని కిచెన్‌లోకి వెళ్ళింది. అన్నం ప్లేట్లలో పెట్టి ముద్దలు తినిపించసాగింది.

“మమ్మీ, డాడీ ఎప్పుడొస్తారు? నన్ను ‘జూ’కి తీసుకెడతానన్నారు కదా?”

“డాడీ ఇప్పుడు రాదు నాన్నా! డాడీకి చాలా పని వుంది. ‘జూ’కి నేను తీసుకు వెళతానుగా” చటుక్కున తల పక్కకి తిప్పుకుంది విజయ.

తల్లి ఏడవడం రవి చూస్తూనే వుంటాడు. “ఏడవకు మమ్మీ! నేనేమీ పేచీ పెట్టనుగా”

తనకు తెలియకుండానే సుళ్ళు తిరుగుతోన్న కన్నీటిని రవి దృష్టిలో పడకుండా తప్పించుకోవడం కష్టమయిపోయింది.

రవి అన్నం తినేశాక ఎత్తుకుని తీసుకువెళ్ళి, మంచం మీద పడుకోబెట్టి తను కూడా పక్కలో పడుకుని, రవి కాళ్ళు తనమీద వేసుకుని, దగ్గిరికి తీసుకుని జో కొడుతూ పడుకుంది.

* * *

సెకండియర్ మెడిసిన్ చదువుతున్న రోజులవి. కాలేజీ ‘డే’ ఇంకొక వారం రోజుల్లో వుంది. విజయ ఒక డ్రామాలో పాల్గొనడంతో రోజూ సాయంత్రం రిహార్సల్స్ కోసం చాలా సేపు కాలేజీలో వుండిపోవలసి వచ్చింది. అప్పుడే మధుతో పరిచయం. మధుసూదన్ క్లాసులో అందరిలో అన్ని సబ్జక్ట్సులో ఫస్ట్ వస్తూ వుండేవాడు. అనాటమీ పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. డ్రామా గొడవల్లో పడి చదువు సరిగా సాగలేదని విజయ భయపడుతూ వుంటే మధు తను సహాయం చేస్తానని చెప్పాడు. అప్పటి నుండి రోజూ లైబ్రరీలో కూర్చుని కలిసి చదివేవారు. మధు చాలా తెలివైనవాడు. ఒక్కసారి చదివితే చాలు ఏ విషయాన్నయినా క్షుణ్ణంగా అర్థం చేసుకుని వివరించి చెప్పగలడు. విజయకు ఎన్నో విషయాలు విడమర్చి చెప్పాడు. మధు సహాయంతో విజయ అనాటమీ పరీక్షలు తేలికగా పాసవగలిగింది.

రోజూ సాయంత్రం కాలేజీ అయిపోయాక కలుసుకుని కాసేపు మాట్లాడుకోవడం ఇద్దరికీ అలవాటయింది. మధు చక్కటి హ్యూమర్‌తో ఎప్పుడూ నవ్విస్తూ వుండేవాడు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. మధు, విజయల స్నేహం మరింత సన్నిహితంగా మారింది. ఒకరిని విడిచి ఒకరు వుండలేనంత అనుబంధం ఏర్పడింది.

“నేనెంత అదృష్టవంతుణ్ణో విజయా! నువ్వు లేకుండా ఇంతవరకూ జీవితం ఎలా గడిచిందోగాని, నువ్వు లేని కాలాన్ని ఇక ముందు వూహించుకోలేను కూడా” అనేవాడు మధు.

“నువ్వు కాదు. నేను అదృష్టవంతురాల్ని. నేను అమితంగా ఆరాధించే వ్యక్తి నన్ను మనసారా ప్రేమించడం నా అదృష్టం కాదూ?”

“ఏ సంగతి నాకు తెలియదు. నేను ప్రేమించే మనిషి నన్ను ఆరాధించడం నా అదృష్టం కాదూ? అసలు అదృష్టవంతుణ్ణి నేను.”

“కాదు, నేనూ”

“సరే, ఇద్దరం! ఇద్దరం అదృష్టవంతులం!” ఇద్దరూ నవ్వుకునే వాళ్ళు.

“మధూ! నీకెప్పుడైనా నామీద ఇష్టంపోతే? నా ప్రశ్న నాకు వెయ్యకు. జవాబు చెప్పు.”

“విజయా! ఎంత మాటన్నావు. సూర్యుడు వుదయించడం మానేయవచ్చేమోగాని ఈ మధుసూదన్ విజయను ప్రేమించడం మానడు.”

“అబ్బో! అన్నీ గొప్పలు! నేనూ చూస్తాగా?”

“చూడు! చూస్తూ వుండు! విజయా, మన మధ్య కుల భేదాలే కాదు, అంతస్థుల భేదాలు కూడా వున్నాయి. ఎన్ని సమస్యలు వచ్చినా మనం కలిసి బ్రతకగలమని నీకు ధైర్యం వుందా?”

“మధూ, ధైర్యమా? నీ చేయి అందుకోవటానికి ఎలాంటి సాహసమైనా చేస్తాను. ఈ ప్రేమను కాదనుకుని నిన్ను వదులుకునేటంత పిరికిదాన్ననుకున్నావా?



పెద్దవాళ్ళు కాదన్నా, నా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు నాకుందని చెబుతాను."

సంభాషణలు అలా సాగిపోతూ వుండేవి.

మధుసూదన్ చాలా పేదకుటుంబంలోంచి వచ్చాడు. ప్రతీ సంవత్సరం స్కాలర్‌షిప్‌తోనే అతని చదువు సాగుతూ వచ్చింది. కాలేజీ జీతానికీ, హాస్టలుకూ బొటాబొటీగా ఆ డబ్బు సరిపోయేది. ఖరీదయిన పుస్తకాలు కొనుక్కోవాలన్నా, సరదాగా కాలేజీ పిక్‌నిక్‌లకు వెళ్ళాలన్నా అతని దగ్గర ఎప్పుడూ డబ్బులు వుండేవి కావు. విజయ చాలాసార్లు డబ్బు సహాయం చేస్తూ వుండేది. విజయావాళ్ళకు విజయవాడలో పెద్ద బట్టల షోరూం వుంది. డబ్బుకి లోటు లేదు.

సుజాత విజయను చాలాసార్లు హెచ్చరించింది. "తొందర పడకు విజయా! మీ చదువులు పూర్తయ్యే వరకన్నా ఓపిక పట్టు! ఇప్పుడు మీ నాన్నగారిని కాదని బయటికి వచ్చేస్తే ఏం చేస్తావు? మీ యిద్దరూ ఎలా బ్రతుకుతారు? బ్రతకటానికి ప్రేమ ఒక్కటే చాలదు. అన్నం కావాలి! ఇంటద్దె కట్టాలి. కాలేజీ ఫీజులు కట్టాలి!"

"అంత అవసరం వస్తే ప్రస్తుతం నేను చదువు మానేసి ఏదైనా జాబ్‌లో చేరతాను. మధు ఫస్ట్ క్లాస్ స్టూడెంటు, అతను మానడం ఎందుకు? అతను డాక్టరయ్యాక నేను చదువుకుంటాను."

"ఎంత ఆశావాదివి విజయా!" అని నవ్వేది సుజాత.

మెడిసిన్ నాల్గో సంవత్సరం పూర్తయిన తరువాత సెలవుల్లో ఇంటికి వెళ్ళినప్పుడు విజయ తన నిర్ణయం తల్లికి చెప్పింది. అనుకున్నట్టుగానే తల్లి చాలా గొడవ చేసింది. "కులంగాని కులం వాణ్ణి పెళ్ళి చేసుకుంటావా? నీ పెళ్ళి నీ ఇష్టమేనా?" అని చాలా కోపంగా మాట్లాడింది.

తండ్రి కూడా అదే చెప్పుకొచ్చాడు కొంచెం శాంతంగా. పుట్టబోయే పిల్లలకు కులం లేకపోతే ప్రమాదం అన్నాడు. డబ్బు లేకపోతే ప్రమాదం అన్నాడు. చాలా నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

తన అభిప్రాయం మార్చుకోనని విజయ చెప్పేసింది.

తల్లీ తండ్రీ హతాశులయ్యారు.

ఆఖరి సంవత్సరం పరీక్షలవుతూనే మధూ విజయా రిజిస్టరు మ్యారేజి చేసుకున్నారు. హౌస్ సర్జన్లో కొత్తగా చేరటం, కొత్త కాపురం, రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. కొన్ని కొన్ని మామూలు ఇబ్బందులు వచ్చినా హాయిగా గడుస్తోంది కాలం.

"విజయా, మృత్యువు తప్ప మనని ప్రపంచంలో ఏదీ విడదీయలేదు" అనేవాడు మధు అనేకసార్లు. విజయ నవ్వేది.

హౌస్ సర్జన్సీ అవ్వగానే మధు అమెరికా వెళ్ళిపోదామన్నాడు. అక్కడ న్యూయార్కులో ఒక యూనివర్సిటీ హాస్పిటల్‌లో అతనికి రెసిడెన్సీ జాబ్ వచ్చింది. ఇద్దరూ న్యూయార్క్ వెళ్ళి సెటిల్ అయ్యారు. కొత్త ప్రదేశం, కొత్త జాబ్! మధు వస్తూనే చాలా బిజీగా అయిపోయాడు.

ప్రెగ్నెన్సీ కాలమంతా విచిత్రమైన అనుభవంగా పూహల్లా గడిచింది. రవి పుట్టినప్పటి నుంచి "మనిద్దరి అనురాగానికి చిహ్నం వీడు. మన జీవితాలకు కాంతి కిరణం వీడు" అనేవాడు మధు.

"వీడు పుట్టకపోతే మన జీవితాలకు కాంతి లేదా?" అని నవ్వేది విజయ.

రవి పుట్టిన మూడు సంవత్సరాల వరకూ విజయ జాబ్ చెయ్యలేదు. పసికందును ఇంట్లో బేబీ సిట్టర్‌కు వదిలి, రెసిడెన్సీలో రాత్రీ పగలూ డ్యూటీ చేయదలచుకోలేదు విజయ.

రవికి నాలుగో సంవత్సరం వస్తూనే డే కేర్ సెంటర్‌లో వాడిని చేర్చి తను పీడియాట్రిక్స్ రెసిడెన్సీలో చేరింది. మధు సర్జరీ రెసిడెన్సీ అవగానే, యూనివర్సిటీలో రిసెర్చి జాబ్‌లో చేరాడు.


మధులో మార్పు ఎప్పుడు వచ్చిందో తను గమనించ లేదు. నాప కింద నీరులాగా తనకు తెలియకుండానే విస్తరించింది అది. ఇంటికి రావడం తగ్గించాడు. ఉదయం ఆరు గంటలకు ఇంట్లో బయలుదేరి, రాత్రి పది గంటలకు ఇంటికి చేరేవాడు. నైట్ డ్యూటీ వున్న రోజు మరునటి రోజు సాయంత్రం దాకా వచ్చేవాడు కాదు. మధు పనిలో ఎంత లగ్నమయిపోతాడో తెలిసిన విషయమే కనుక విజయ పెద్దగా పట్టించుకోలేదు.

ఆ రోజు తప్పకుండా సాయంత్రం ఇంటికి త్వరగా వస్తానన్నాడు. 5 గంటల నుండీ ఎదురు చూస్తూనే వుంది విజయ. రాత్రి పది గంటలకు ఫోన్ చేసి "ఎమర్జెన్సీ వచ్చింది రాలేక పోతున్నాను, ఈ రాత్రికి హాస్పిటల్‌లోనే వుంటాన"ని చెప్పాడు. పెళ్ళయిన అన్ని సంవత్సరాలకు మొట్టమొదటి సారిగా విజయ మనస్సుకు కష్టమనిపించింది. 'తను ప్రయత్నిస్తే రాలేక పోయే వాడా?' అనిపించింది. ఎంత అర్థం చేసుకుందామన్నా మధు ప్రవర్తన అర్థం కావడం లేదనుకుంది. ఇంట్లో వున్న కాసేపయినా మాట్లాడటం తగ్గించేశాడు. ఎంత సరిపెట్టుకున్నా "ఎందుకిలా చేస్తున్నాడు మధు" అనే ప్రశ్న రాక మానేది కాదు.

తనూ వర్క్ చేస్తూనే వుంది. ఎంత పని వున్నా, రవికి కొంచెం వళ్ళు వెచ్చబడినా వెంటనే వచ్చి చూసుకుంటుంది. అలాంటిది రవికి బాగా హై ఫీవర్ వచ్చి హాస్పిటల్‌లో చేర్పినప్పుడు కూడా మధు టయిము తీసుకుని వాడి దగ్గర కూర్చోలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. మనస్సు విప్పి మాట్లాడుకోవడం, ఒక్క రోజయినా కలిసి కూర్చుని భోజనం చేయడం...ఏమీ లేదు. మధు ప్రవర్తనకు కారణం ఊహించుకోలేక పోయినా, విజయ ఏనాడూ అనుమాత్రంగా కూడా అతన్ని శంకించ లేదు. 'భార్యా భర్తల మధ్య అనురాగం, ఆత్మీయతలతోపాటు, విశ్వాసం కూడా వుండాలి. ఆ విశ్వాసం లేకపోతే ఆ అనుబంధానికి అర్థమే లేదు' అనుకునేది.

కాని ఆ రోజు...అది వింటర్ టయిము. ఎముకలు కొరికేసే చలి. అరంగుళాల స్నో పడింది. బయటకు వెళ్ళాలంటే ప్రాణాంతకంగా వుంది. ఉదయమే లేచి రవిని డే కేర్ సెంటర్‌లో వదిలి హాస్పిటల్‌కు వెళ్ళింది. హాస్పిటలు గేటు దగ్గర మధు తన కోసం ఎదురు




చూస్తున్నాడు. "విజయా! నీతో కొద్దిగా మాట్లాడాలి! ఎంత ప్రయత్నించినా నీ ఎదురుగా ఏమీ చెప్పలేక పోయాను. అందుకే ఈ లెటర్‌లో అంతా వివరంగా వ్రాశాను. చదువు!" అంటూ ఒక కవరు చేతిలో పెట్టి త్వర త్వరగా వెళ్ళిపోయాడు.

ఆ కవరు చూస్తేనే విజయ గుండె ఝల్లుమంది. గబగబా వెయింటింగ్ రూమ్‌కి వెళ్ళి వణుకుతున్న చేతులతో కవరు విప్పింది.

విజయా!

నిన్ను క్షమించమని అడిగే అర్హత కూడా నాకు లేదు. దేవత లాంటి నిన్ను చాలా డిసీవ్ చేసాను. ఒక సంవత్సర కాలంగా నీతో చాలా అబద్ధాలు చెప్పాను. అయినా ఒక్కసారి కూడా నన్ను నువ్వు అనుమానించ లేదు. ఇక నిన్ను మోసగించే శక్తి నాలో లేదు.

నేను చాలా బలహీనుణ్ణి విజయా! నీ అంతటి శక్తి నాకు లేదు. నా మనసును అదుపులో పెట్టుకునే శక్తి నాకు లేదు. అది చంచలిస్తూనే వుంది.

క్రిస్టీతో నాకు గత సంవత్సరంగా పరిచయం వుంది. ఆ అమ్మాయి మా డిపార్టుమెంటులోనే పనిచేస్తోంది. నా పర్సనల్ సెక్రటరీ. ఎప్పుడు ఎలా మొదలయిందో తెలియదు. నేను క్రిస్టీని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని ప్రామిస్ చేశాను.

నీకూ, రవికీ నెల నెలకూ కావలసిన డబ్బు ఏర్పాటు చేస్తాను.

మన పెళ్ళికి ముందు చేసిన ప్రామిస్ నిలుపుకోలేనందుకు నేను చాలా బాధ పడుతున్నాను విజయా! నీవు ఎప్పటికీ అనాటి ప్రేమ మూర్తివే! నన్ను క్షమిస్తావు కదూ!

నీవు కూడా నన్ను మర్చిపోవటానికి ప్రయత్నించు విజయా! నీ జీవితానికి కొత్త బాట ఏర్పరచుకో!

ఎప్పటికీ నీ మేలుకోరే

మధు


ఉత్తరం చదవడం పూర్తయేసరికి విజయకు స్పృహ తప్పినట్లనిపించింది. శరీరం వణికి పోతోంది. చేతులు ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాయి.

ఇంత స్వార్థపరుడా ఈ మనిషి! ఇంత బలహీనుడికా తను ఆత్మార్పణ చేసుకున్నది...చిన్న ఉత్తరంతో ఎంత తేలికగా తెంపేశాడు బంధం! డబ్బు ఇస్తాడట! తను కూడా కొత్త బాట ఏర్పాటు చేసుకోవాలట! కొత్త బాట!

ఆ కష్ట కాలంలో రాజేష్ చాలా సహాయం చేశాడు విజయకి. రాజేష్ మధు స్నేహితుడు. విజయతో కూడా బాగా చనువు. జరిగిందంతా తెలిసి రాజేష్ విజయని చాలా ఆదుకున్నాడు. దాదాపు రోజూ వచ్చి రవితో ఆడుకునేవాడు. విజయతో మాట్లాడేవాడు. ఇంట్లోకి ఏమైనా కావలిస్తే చూసి వెళ్ళేవాడు.

దాదాపు మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. విజయ తన వర్క్‌లో యిమిడిపోయి ఒక రొటీనుకు అలవాటు పడింది. రవి స్కూల్లో సెకండు గ్రేడ్‌కు వచ్చాడు.

రాజేష్ రెండు మూడు సార్లు తన అభిలాషను వ్యక్తం చేశాడు. "విజయా! నేను నీకు అనవసరమయిన వాగ్దానాలేమీ చేయను. కానీ మంచి స్నేహితుడిగా,



మంచి భర్తగా, మంచి తండ్రిగా వుండగలనని నా నమ్మకం. రవి, నీకే కాదు, నాకు కూడా కొడుకే. లెటజ్ బి ఎ ఫామిలీ" అన్నాడు.

విజయ మౌనంగా వుండిపోయింది. -"నాకు నీ సమాధానం కావాలి" అని రాజేష్ మళ్ళీ మళ్ళీ అడిగాడు.

"రాజేష్! నా కష్టకాలంలో నాకు చాలా సహాయంగా వున్నావు. నీ మేలు మరిచిపోను. కానీ ఇది నీకు ఫెయిర్ కాదు. నీ మీద నాకు అలాంటి దృష్టి లేదు."

రాజేష్ కుంగిపోయినట్టయ్యాడు. ఎంతోసేపు మాట్లాడలేక పోయాడు.

"మధు తిరిగి వస్తాడేమోనని ఇంకా...అనుకుంటున్నావా విజయా?"

"ఇదా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది? ఇప్పుడు నా మనసులో వున్నది అతని మీద ప్రేమ కాదు. బాధ! ఆ మనిషిని అర్థం చేసుకోవటంలో ఇంత పొరపాటు ఎలా పడ్డానా అని బాధ! అతని స్వార్థాన్ని ఎందుకు గుర్తించలేక పోయానా అని బాధ! అంతే. ఇంకెప్పుడూ అతని మాట ఎత్తకు..."

"క్షమించు విజయా! నా సంగతి కూడా ఇంకెప్పుడూ ఎత్తవద్దా?"

"చెప్పలేను."

* * *

సుజా!

నీ వుత్తరాలన్నీ అందుతూనే వున్నాయి. నేనూ, రవి బాగున్నాం. అంతా మామూలే.

ప్రేమ గురించి నీ వాదన మారలేదు. నా వాదనా మారలేదు. గుర్తుందా మనం కాలేజీ రోజుల్నించి వాదించుకుంటూనే వున్నాం. ప్రేమ శాశ్వత మయినది నేనూ, ప్రేమలు మారిపోతూ వుంటాయని నువ్వూ అంటూ వుండేవాళ్ళం. నా విషయంలో జరిగింది తెలుసుకదా? మా యిద్దరిలోనూ ప్రేమ మారింది.

ఇప్పుడు అతనికి నా మీద ప్రేమ లేదు.

నాకు కూడా అతని మీద ప్రేమ లేదు.

కానీ, మా ప్రేమలు పోవడానికి కారణాలు పూర్తిగా వేరు వేరు.

ఇద్దరూ ప్రేమ ఎరిగిన మనుష్యులయితే వారి హృదయాల్లో ప్రేమ ఎప్పటికీ పోదని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను.


ప్రేమ శాశ్వత మయిందే. కానీ ఎప్పుడూ? అది రెండు హృదయాలలోనూ వెలిగినప్పుడు. రెండు హృదయాలూ నిర్మల హృదయాలయినప్పుడు! అలా కాకపోతే ఒక హృదయంలో ఎంత ప్రేమ జ్వాల వున్నా అది ఆరిపోతుంది.

ప్రేమ మారుతుందని నీవు అన్నది ఈ 'వ్యాపార' ప్రపంచాన్ని చూసి!

ప్రేమ మారదని నేను అన్నది నా వూహాలోకాన్ని చూసి!

నీ విజయ


వీరిని అసహ్యించుకోకండి!
జాలి పడటం మానేయండి!!



ఈ దుస్థితి రేపు
మీకు కాకపోవచ్చు-
మీ స్నేహితులకి-
మీ కుటుంబ సభ్యులకి-
రాకుండా జాగ్రత్త పడండి!
ఇందుకు మీరు వందలు, వేలు ఖర్చు పెట్టనవసరం లేదు.
డాక్టర్లని సంప్రదించనవసరం లేదు.
వారం వారం
డాక్టర్ - రైటర్
డా. జి. సమరం గారి సీరియల్
"..X" క్లినిక్
చదవండి! చదివించండి